క్లుప్తంగా

రక్తదాన శిబిరం ప్రారంభం



రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ఇస్నాపూర్ మున్సిపాలిటీలో మిలాద్ ఉన్ నబీ పురస్కరించుకొని మేరా ఇండియా సోషల్ సర్వీస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సమాజ సేవలో సంస్థ చేపడుతున్న కార్యక్రమాలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శ్రీశైలం , మల్లారెడ్డి, శోభ కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, శ్రీనివాస్, మేరాజ్ ఖాన్, స్వచ్ఛంద సంస్థ బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నివాళులు

పటాన్‌చెరు: కార్మిక నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు ఎల్లయ్య మరణం కార్మిక రంగానికి తీరని లోటని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కృష్ణారెడ్డిపేట గ్రామ పరిధిలో గల ఎల్లయ్య నివాసానికి వెళ్లి ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు.

'కవిత వ్యాఖ్యల వెనుక బీజేపీ'



మాట్లాడుతున్న మోహిద్‌ఖాన్

నారాయణఖేడ్: జాగృతి అధ్యక్షురాలు కవిత మాజీ మంత్రి హరీశ్‌రావు, సంతోష్‌రావులపై చేసిన వ్యాఖ్యల వెనుక బీజేపీ ప్రోద్బలం ఉందని బీఆర్‌ఎస్ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎంఏ మొహిద్‌ఖాన్ విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కవిత బీఆర్ఎస్ ద్వారానే లబ్ధిపొందిందన్నారు. ఆమె 2006లో పార్టీలోకి వచ్చిందని, లిక్కర్ కేసు నుంచి బయటపడేందుకు బీజేపీ ఆడించినట్లు ఆడుతోందని విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు పార్టీకి మూల స్తంభాలు అన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రభాకర్, బాసిత్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా ప్రవీణ్ కుమార్

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రానికి చెందిన నల్లుల ప్రవీణ్ కుమార్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధిగా ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా అధ్యక్షుడు బుచ్చంద్ర మాదిగ చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల ప్రకారం పని చేస్తానని తెలిపారు.

జీవాలకు టీకాలు తప్పనిసరి



జీవాలకు టీకా వేస్తున్న సిబ్బంది

రాయికోడ్(అందోల్): గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి పాండెన్ సూచించారు. మండలంలోని హస్నాబాద్, శంశోద్దీన్‌పూర్‌లలో శుక్రవారం జీవాలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 8 వేల గొర్రెలు, మేకలు ఉండగా.. 16 గ్రామాల్లో 3 వేల జీవాలకు టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సుకేష్ పాల్, ఘని, యాదమ్మ, గోపాలమిత్రలు, పోషకులు ఉన్నారు.

హరీశ్‌రావుపై అసత్య ఆరోపణలు తగవు

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి



గోవర్ధన్ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): మాజీ మంత్రి హరీశ్‌రావుపై అసత్య ఆరోపణలు చేయడం తగదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం గుమ్మడిదల మున్సిపాలిటీలో ఆయన మాట్లాడారు. తెలంగాణ మలిదశ పోరాటంలో హరీశ్‌రావు పాత్ర మరువలేనిదన్నారు.

బడా గణేశుడికి పూజలు

పటాన్‌చెరు: ఖైరతాబాద్ విఘ్నేశ్వరుడు భక్తుల సర్వ విఘ్నాలను తొలగించి సుఖసంతోషాలు ప్రసాదించాలని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం ఖైరతాబాద్‌లోని బడా గణేశుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ రాజ్ కుమార్, సభ్యులు వీణ మాధురి, గంగాధర్, నిశాంత్, మొగల్, సందీప్, రాజు, అజయ్, చిన్న, ఖైరతాబాద్ , ఎస్ఎంఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థి జీవితాన్ని మలిచేది గురువే!

● ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం ● ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన మహనీయుడు మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సర్వేపల్లితో పాటు సావిత్రి బాయి పూలే, జ్యోతి బాపులే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలన కొనియాడారు. ఈ మేరకు సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైందని, విద్యార్థి జీవితాన్నే మలిచేది గురువేనని పలువురు విద్యావేత్తలు పేర్కొన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.



సంగారెడ్డి ఎడ్యుకేషన్: నివాళులర్పిస్తున్న తారా కళాశాల అధ్యాపకులు



పటాన్‌చెరు టౌన్: సర్వేపల్లి రాధాకృష్ణకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేత నీలం మధు



సంగారెడ్డి: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న బీసీ బీసీ సంక్షేమ సంఘం నాయకులు



పటాన్‌చెరు టౌన్: ఉపాధ్యాయ బృందానికి బహుమతులు అందజేస్తున్న లా కళాశాల కరస్పాండెంట్



జహీరాబాద్ టౌన్: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న చంద్రశేఖర్



రామచంద్రాపురం: మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగులు



జహీరాబాద్ టౌన్: ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు తులసీరాం రాథోడ్

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

సంగారెడ్డి ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్ర పటానికి శుక్రవారం బీజేపీ నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సామాన్య ప్రజలను దృష్టిలో పెట్టుకొని జీఎస్టీ స్లాబ్‌లను తక్కువ చేయడం హర్షణీయమన్నారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో నిత్యావసర వస్తువులు మధ్యతరగతి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు విజయ్‌కుమార్, వాసు, వెంకట నరసింహారెడ్డి, కార్యదర్శి నాగరాజ్, పట్టణ మాజీ అధ్యక్షుడు రవి, మీనా గౌడ్, శ్రీకాంత్, రామచందర్, తదితరులు పాల్గొన్నారు.



ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

గోపాలమిత్ర జిల్లా కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

సంగారెడ్డి: జిల్లాలో పనిచేస్తున్న గోపాలమిత్రలు శుక్రవారం సమావేశమయ్యారు. ఈ మేరకు జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గంప శివకుమార్, ఉపాధ్యక్షుడిగా డప్పు మాణిక్యం, కార్యదర్శిగా అలిగే శ్రీకాంత్‌లను ఎన్నుకున్నారు. గోపాలమిత్రల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికి రేషన్ కార్డు అందజేస్తాం



జహీరాబాద్ టౌన్: కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ మహేష్, డీటీ జుబేర్, మక్సూద్



రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న తిరుపతిరెడ్డి

జహీరాబాద్ టౌన్: ప్రతి పేదవాడికి కొత్త రేషన్ కార్డు అందజేస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మక్సూద్ అన్నారు. మండల కేంద్రంలోని మొగుడంపల్లి రైతు వేదికలో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మహేష్, డిప్యూటీ తహసీల్దార్ జుబేర్ అహ్మద్, ఆర్ఐ సిద్దారెడ్డి, పంచాయతీ కార్యదర్శి మారుతి పాల్గొన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని మెటల్ కుంట, హద్నూర్, ముంగి, మిర్జాపూర్(ఎన్), టేకూర్, తాట్‌పల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. అర్హులందరికీ రేషన్ కార్డులు పంపిణీ చేస్తామన్నారు. రేషన్ కార్డులు లేనివారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్‌ల చైర్మన్లు సిద్దిలింగయ్య స్వామి, జగనాథ్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, శ్యామెల్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా షాదీఖానా భవనాలు

● దశాబ్దాలుగా నిలిచిన నిర్మాణ పనులు
● పట్టించుకోని అధికారులు

హత్నూర(సంగారెడ్డి): మైనార్టీల సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. దశాబ్దాలు గడుస్తున్నా షాదీఖానా నిర్మాణ పనులు అసంపూర్తిగానే నిలిచిపోతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంజూరైన షాదీఖానా భవనాలను పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. మైనార్టీల సంక్షేమం కోసం మండల కేంద్రంలో ఉమ్మడి ఏపీలో టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి రవాణా శాఖ మంత్రిగా ఉన్న కేసీఆర్.. షాదీఖానా నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. అయితే భవన నిర్మాణాన్ని చేపట్టి వదిలేయడంతో దశాబ్దాలుగా నిరుపయోగంగా మారాయి. అలాగే కిటికీలు, తలుపులు పూర్తిగా తుప్పుపడుతున్నాయి. ఈ భవనాలను ఎవరూ పట్టించుకోకపోవడంతో రూ.లక్షల్లో వెచ్చించి నిర్మించిన భవనం వృథాగా మారిపోయాయి. ఇందులో భాగంగానే కాసాల–దౌల్తాబాద్ గ్రామ శివారులో 2004 జూలై 24న ఎమ్మెల్యే, సునీత రెడ్డి షాదీఖానా భవన నిర్మాణం కోసం రూ.7.50 లక్షలు మంజూరు చేయించి పనులకు శంకుస్థాపన చేశారు. అయితే కాంట్రాక్టర్ హడావిడిగా పిల్లర్ల వరకు పనులు చేయించి వదిలేశారు. ఆ తర్వాత భవన నిర్మాణం పిల్లర్లకే పరిమితమైంది. అప్పటి నుంచి ఎవరూ కన్నెత్తి చూడకపోవడంతో నిలిచిన భవన నిర్మాణంలో పిచ్చి మొక్కలు మొలిచాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో మైనారిటీల సంక్షేమం కోసం నిర్మించిన షాదీఖానా భవనాలు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



హత్నూరలో శిథిలావస్థకు చేరిన షాదీఖానా భవనం

గణేష్ గడ్డ జాతరకు ముమ్మర ఏర్పాట్లు

పటాన్‌చెరు టౌన్: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని రుద్రారం గ్రామ సమీపంలో కొలువైన గణేష్‌గడ్డ దేవస్థానం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. ఈ మేరకు ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించినట్లు ఆలయ అర్చకులు సంతోష్ జోషి, చంద్రశేఖర్, జగదీశ్వర్ స్వామి, అయ్యప్ప, సతీష్‌లు తెలిపారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో గణనాథుడి అలంకరించారు. జాతరకు సంబంధించి, అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ లావణ్య, జూనియర్ అసిస్టెంట్ ఈశ్వర్, ఆలయ చైర్మన్ హరి ప్రసాద్ రెడ్డి తెలిపారు.



వివిధ రకాల పుష్పాల అలంకరణలో గణనాథుడు

'జాయ్' స్కూల్లో ఇన్నోవేటర్స్ బ్లాక్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పాల్వంచ నయానార్

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం పట్టణ పరిధిలోని జాయ్ ఇంటర్నేషనల్ స్కూల్లో నూతనంగా నిర్మించిన ఇన్నోవేటర్స్ బ్లాక్‌ను కమర్షియల్ టాక్స్ శాఖ జాయింట్ కమిషనర్ పాల్వంచ నయానార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డిజిటల్ విద్యపై విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. ఈ మేరకు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ప్రసాద్ రెడ్డి, ఫౌండర్ డైరెక్టర్ సతీష్ కుమార్, అకాడమిక్ డైరెక్టర్ స్మిత భోగరాజు, ప్రిన్సిపాల్ దాక్షాయిని, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెద్ద దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

హత్నూర (సంగారెడ్డి): మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంలోని షారుల్లా షహీద్ దర్గాతో పాటు పెద్ద దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులు ఖాలెద్ సహాబ్ ఖాద్రీ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, పాడిపంటలు బాగా పండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హత్నూర మాజీ సర్పంచ్ వీరస్వామి గౌడ్ కాంగ్రెస్ పార్టీ మండల మైనార్టీ అధ్యక్షుడు అల్తాఫ్ హుస్సేన్, నాయకులు ఇస్మాయిల్, అహ్మద్ హుస్సేన్ పాల్గొన్నారు.



పూజ నిర్వహిస్తున్న గురువులు

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!

వినియోగంలోకి రాయికోడ్ బస్టాండ్

● రాకపోకలు సాగిస్తున్న బస్సులు
● తీరిన ప్రయాణికుల ఇబ్బందులు

రాయికోడ్(అందోల్): నిరుపయోగంగా మారిన రాయికోడ్ బస్టాండ్ వినియోగంలోకి వచ్చింది. దీంతో ఎంతోకాలంగా నిరీక్షిస్తున్న ప్రయాణికుల ఇబ్బందులు తీరాయి. ప్రయాణికుల సౌకర్యం కోసం రాయికోడ్ పోలీస్ స్టేషన్ ఎదురుగా 1996లో రూ.12 లక్షల నిధులతో బస్టాండ్ నిర్మించారు. బస్టాండ్ ప్రారంభించిన కొన్నాళ్లకే ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌లోకి రావడంతో ప్రయాణికులు ఆర్టీసీ సేవలు సౌకర్యవంతంగా వినియోగించుకున్నారు. అయితే ఆ తర్వాత బస్టాండ్ నిరుపయోగంగా ఉంది. కాగా, రాయికోడ్ మీదుగా హైదరాబాద్, మెదక్, నిజామాబాద్, బోధన్, బాన్సువాడ, జహీరాబాద్, నారాయణఖేడ్, తదితర పట్టణాలు, నగరాలకు బస్సు సర్వీసులు నడుపుతున్నారు. ఆయా రూట్లలో ప్రయాణించే ప్రయాణికులు సుమారు రెండు దశాబ్దాలుగా రోడ్లపైనే నిల్చుని ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాల్సిన దుస్థితి ఉండేది. దీంతో బస్టాండ్ ఆవరణ పిచ్చిమొక్కలతో నిరుపయోగంగా మారింది. ఈ నేపథ్యంలో స్పందించిన అధికారులు బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకొచ్చారు. గత నాలుగు రోజుల నుంచి రాయికోడ్ మీదుగా వెళ్లే ప్రతీ ఆర్టీసీ బస్సు బస్టాండ్‌లోకి వెళ్తున్నాయి. దీంతో గత కొంతకాలంగా రోడ్లపై బస్సుల కోసం నిల్చున్న ప్రయాణికులకు ఉపశమనం కలిగింది. అదేవిధంగా బస్టాండ్‌లో ఉన్న మరుగుదొడ్లు సైతం వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అంతేకాకుండా ప్రయాణికుల కోసం బస్టాండ్‌లో కుర్చీలు, తాగునీరు అందుబాటులో ఉంచాలని విన్నవిస్తున్నారు.



రాయికోడ్ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న జహీరాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ స్వామి

గణనాథా.. నమోస్తుతే

జిల్లా వ్యాప్తంగా నవరాత్రి ఉత్సావల్లో భాగంగా వినాయక మండపాల వద్ద వినాయక విగ్రహాలకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు నిమజ్జనోత్సం సందర్భంగా మండపాల వద్ద నిర్వాహకుల సందడి నెలకొంది. ఈ నేపథ్యంలో వివిధ మండపాల వద్ద నిర్వహించిన లడ్డూ వేలం పాటల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.



అమీన్‌పూర్‌లో హ్యాపీ ఫెదర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



సంగారెడ్డి: వినాయకుడి పూజల్లో హెల్పింగ్ హాండ్స్ సభ్యులు



సదాశివపేట: బృందావన్ కాలనీలో వినాయకుడికి హారతులిస్తున్న మహిళలు



జహీరాబాద్: వేలం పాటలో లడ్డూను దక్కించుకున్న మధుకర్‌రెడ్డి దంపతులు



సదాశివపేట: లోపలికోట హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజల్లో భక్తులు



సదాశివపేట: గాంధీచౌక్ వద్ద జైభజ్‌రంగ్ సేవాదళ్ ఆధ్వర్యంలో అన్నదానం



జహీరాబాద్ టౌన్: నిమజ్జనంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు,సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి



జహీరాబాద్ టౌన్: నారింజ ప్రాజెక్టు వద్ద చేపడుతున్న వినాయకుల నిమజ్జనం



పటాన్‌చెరు టౌన్: పూజల్లో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి